యోగా గురువులకు సన్మానం

యోగా గురువులను సన్మానించిన జేసీఐ ప్రతినిధులు

సుభాష్‌నగర్, జూన్ 20: ప్రపంచ యోగా దినోత్సవంలో భాగంగా జేసీఐ క్లబ్ ఆధ్వర్యంలో వినాయక్‌నగర్‌లోని పతంజలి యోగా సెంటర్‌లో గురువారం యోగా గురువులను సన్మానించారు. యోగా ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు యోగా గురువులు కృషి చేయాలని క్లబ్ డైరెక్టర్ విజయానంద్, పురుషోత్తమరెడ్డి సూచించారు. అనంతరం యోగా రత్నప్రభాకర్, కిషన్,బాలశేఖర్, బంటు సంతోష్, భూమాగౌడ్, గంగాధర్, తిరుమల్, జలంధర్‌గౌడ్ తదితరులను సన్మానించారు. జేసీఐ ఇందూరు అధ్యక్షుడు మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'నీట్' పేపర్ లీకేజీ బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

ఖలీల్‌వాడి, జూన్ 20 : నీట్ పేపర్ లీకేజీ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద గురువారం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. పార్టీ నాయకుడు రమేశ్‌బాబు మాట్లాడుతూ.. నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అంతవరకు సంబంధిత శాఖ మంత్రి బాధ్యతల నుంచి వైదొలగాలంటూ నినాదాలు చేశారు. లీకేజీకి పాల్పడిన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పెద్ది వెంకట్రాములు, నూర్జహాన్, శంకర్‌గౌడ్, పి.వెంకటేశ్, సుజాత, విష్ణు, మహేశ్, సూరి, రాములు పాల్గొన్నారు.

అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

చందూర్, జూన్ 20: మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల జూనియర్ కళాశాలలో తాత్కాలిక పద్ధతిన సివిక్స్ సబ్జెక్ట్ బోధించడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ సివిక్స్, బీఈడీ కనీసం 55శాతం మార్కులు సాధించి, నెట్,సెట్ అర్హత ఉన్నవారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ ధ్రువపత్రాలతో ఈ నెల 23న కళాశాలలో సంప్రదించాలని సూచించారు. మిగతా వివరాలకు 7995057913 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఆర్టీఏ, పోలీస్‌ల స్పెషల్ డ్రైవ్

వినాయక్‌నగర్, జూన్ 20: నగరంలో టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆర్టీఏ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. ధ్రువపత్రాలు లేని, రిజిస్ట్రేషన్ నంబర్ సక్రమంగా లేని, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా నడుపుతున్న వాహనాలను స్వాధీనం చేసుకొన్నారు. తనిఖీల్లో మొత్తం 50 వాహనాలను సీజ్ చేశారు. స్పెషల్ డ్రైవ్‌లో నగర సీఐ బి.నరహరి, ట్రాఫిక్ సీఐ వెంకట నారాయణ, ఎంవీఐ ఉమామహేశ్వరరావు, రెండో టౌన్ ఎస్సై రాము పాల్గొన్నారు.

నేడు జడ్పీ చివరి సర్వసభ్య సమావేశం

ఖలీల్‌వాడి, జూన్ 21: నిజామాబాద్ జడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నారు. జడ్పీ సమావేశ మందిరంలో చివరి సమావేశాన్ని నిర్వహించనున్నట్లు చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, రాజ్యసభ సభ్యుడు సురేశ్‌రెడ్డి, ఎంపీలు ధర్మపురి అర్వింద్, సురేశ్ షెట్కార్ హాజరుకానున్నారని పేర్కొన్నారు. ఎంపీపీలు, జడ్పీటీసీలు సకాలంలో హాజరుకావాలని సూచించారు.

పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

సమన్వయ కమిటీ సమావేశంలో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

కంఠేశ్వర్, జూన్ 20: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్‌సర్వీస్ కమిషన్ పరీక్షలను జిల్లాలో ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ అధికారులకు సూచించారు. ఈ నెల 24 నుంచి 29 వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతిగృహాల వెల్ఫేర్ ఆఫీసర్ల నియామక రాత పరీక్షతోపాటు ఈ నెల 30 నుంచి జూలై 4 వరకు డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ నియామకరాత పరీక్ష నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని తన చాంబర్‌లో సంబంధిత శాఖల అధికారులతో గురువారం సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ నెల 23న నిర్వహించనున్న నీట్, పీజీ పరీక్షల ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. పరీక్షలు పకడ్బందీగా కొనసాగేలా సంబంధిత అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలన్నారు. తాగునీరు, ఫస్ట్‌ఎయిడ్ చికిత్సకు ఏర్పాట్లు చేయాలని, సమయానుకూలంగా ఆర్టీసీ బస్సులు నడపాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ జిరాక్స్ కేంద్రాలు మూసివేయించాలని సూచించారు. బయోమెట్రిక్ విధానం నేపథ్యంలో అభ్యర్థులు కనీసం రెండు గంటలముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అన్నారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని, పరీక్షల నిర్వహణ,నిబంధనలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సమావేశంలో అదనపు డీసీపీ శ్రీనివాస్, కలెక్టరేట్ పరీక్షల విభాగం పర్యవేక్షకుడు పవన్, ఆర్టీసీ, వైద్యారోగ్య తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లా జైలులో టీబీ, ఎయిడ్స్‌పై అవగాహన

411 మంది ఖైదీలకు పరీక్షలు

ఖైదీలకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

వినాయక్‌నగర్, జూన్ 20: రూరల్ మండలం సారంగాపూర్‌లో ఉన్న జిల్లా జైలులోని ఖైదీలకు టీబీ, ఎయిడ్స్‌పై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జైలులోని 411 మంది ఖైదీలకు టీబీ స్క్రీనింగ్, హెచ్ఐవీ టెస్టులు చేశారు. ఇందులో టీబీ లక్షణాలు ఉన్న 19 మంది ఖైదీల తెమడా నమూనాలు సేకరించినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ తుకారాం రాథోడ్ తెలిపారు. ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, రెండు వారాలకు మించి దగ్గు ఉంటే వెంటనే వైద్యులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ ప్రమోద్, జైలర్ రాజశేఖర్ రెడ్డి, టీబీ కంట్రోల్ ఆఫీసర్ డాక్టర్, సీహెచ్ సంతోష్, జైలు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజకుమార్, జిల్లా టీబీ కో ఆర్డినేటర్ రవిగౌడ్, డీపీఎం సుధాకర్, స్వాతి, ఎన్‌జీవో మహేశ్, జైలు ఫార్మాసిస్ట్ శ్రీనివాస్, సూపర్‌వైజర్ స్రవంతి,యాహియా తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ కింద పడి మున్సిపల్ కార్మికురాలి మృతి

వినాయక్‌నగర్,జూన్ 20: ట్రాక్టర్ కింద పడి ఓ కార్మికురాలు దుర్మరణం చెందింది. ఈ ఘటన నగర శివారులోని ఖిల్లా ప్రాంతంలో గురువారం ఉదయం చోటు చేసుకుంది. ఐదో టౌన్ ఎస్సై అశోక్ తెలిపిన ప్రకారం.. చంద్రశేఖర్ కాలనీకి చెందిన పోల లలిత(42) మున్సిపల్ కార్మికురాలుగా పని చేస్తుంది. బాబన్ సాహెబ్ పహాడ్ ప్రాంతంలో పనిచేసే కార్మికురాలు విధులకు రాకపోవడంతో ఆమె స్థానంలో లలితను అక్కడికి పంపించారు. అక్కడ లలిత, విమల ఇద్దరు తమ విధులు ముగించుకొని నడుచుకుంటూ వస్తుండగా.. చెత్త సేకరించే ట్రాక్టర్ అటువైపు నుంచి వెళ్తుండడంతో తమకు అక్కడి వరకు దింపేయాలని ట్రాక్టర్ డ్రైవర్ గైక్వాడ్ సంజీవ్‌ను కోరారు. దీంతో అతడు ఇద్దరిని తన సీట్ పక్కన కూర్చోబెట్టుకున్నాడు. కొద్ది దూరం వెళ్లిన తర్వాత లలిత చున్నీ ట్రాక్టర్ చక్రంలో ఇరుక్కోవడంతో మూలమలుపు వద్ద కింద పడిపోయింది. ఈ క్రమంలో ఆమె తల పై నుంచి ట్రాక్టర్ చక్రం వెళ్లడంతో అక్కడిక్కడే మృతిచెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు డ్రైవర్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

భూ సమస్యలు పరిష్కరించాలి

సర్వేయర్‌కు సూచనలు చేస్తున్న ఆర్డీవో

నవీపేట, జూన్ 20: కొన్నేండ్ల నుంచి రైతులకు సంబంధించిన భూముల పెండింగ్ సమస్యలను ఈనెల చివరిలోగా పరిష్కరించేలా కృషి చేయాలని నిజామాబాద్ ఆర్డీవో రాజేందర్‌కుమార్ సూచించారు. గురువారం స్థానిక తహసీల్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. రెవెన్యూ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. నవీపేటలో 200కు పైగా పెండింగ్ ఫైల్స్ పరిష్కరించామని మరో 198 ఫైల్స్ మాత్రమే పరిష్కరించాల్సి ఉందని తహసీల్దార్ నారాయణ ఆర్డీవోకు వివరించారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది దేవీసింగ్, గంగాధర్, నరేశ్, దేవేందర్ తదితరులు ఉన్నారు.

సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హెచ్ఆర్సీలో ఇద్దరు బట్టాపూర్ వాసులు

కట్కం సామంత్‌రెడ్డి

కైరి నరేశ్‌గౌడ్

ఏర్గట్ల, జూన్ 20: సోషల్ జస్టిస్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నూతన కార్యవర్గంలో బట్టాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరికి చోటు దక్కింది. కట్కం సామంత్‌రెడ్డిని నిజామాబాద్ జిల్లా డైరెక్టర్‌గా, కైరి నరేశ్ గౌడ్‌ను అర్మూర్ నియోజకవర్గ చైర్మన్‌గా నియమించినట్లు జిల్లా డైరెక్టర్ సామంత్‌రెడ్డి తెలిపారు. ఒకే గ్రామానికి చెందిన తమకు అవకాశం కల్పించిన సోషల్ జస్టిస్ వరల్డ్ హెస్ఆర్‌సీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

జూనియర్ కళాశాల తనిఖీ

ఖలీల్‌వాడి, జూన్ 20 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.కళాశాల నిర్వహణ, అధ్యాపకుల పనితీరు సమీక్షించారు. 2023-24 సంవత్సరంలో అత్యుత్తమ ఫలితాలను సాధించడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. పేద, బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలకు చెందిన విద్యార్థులు కళాశాలలో అడ్మిషన్లు పొంది ప్రభుత్వ ఉచిత విద్యను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ నుస్రత్ జహాన్ తదితరులు ఉన్నారు.

'ప్రీ స్కూల్'పై అంగన్‌వాడీలకు శిక్షణ

కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ నీతూకిరణ్, అంగన్‌వాడీ టీచర్లు

ఖలీల్‌వాడి, జూన్ 20: జిల్లా కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లకు గురువారం 'రివైజ్డ్ ప్రీ స్కూల్, ప్రీ ఎడ్యుకేషన్' శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నగర మేయర్ దండు నీతూకిరణ్, డీడబ్ల్యూవో కె.రసూల్‌బీ, స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్ధయ్య హాజరయ్యారు. బ్యాచ్‌కు 36 మంది చొప్పున ఎనిమిది బ్యాచ్‌ల వారికి శిక్షణ ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సరిత, శోభ, బుజ్జి, పుష్ప, ప్రకాశ్, రంజిత్ పాల్గొన్నారు.

'ఎత్తిపోతల' పనులు పూర్తి చేయాలి

శాఖాపూర్ లిఫ్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నవీపేట, జూన్ 20: మండలంలోని శాఖాపూర్ లిఫ్ట మరమ్మతు పనులను ఆగస్టు వరకు పూర్తి చేసి వానాకాలం పంటలకు నీరు అందించాలని ఇరిగేషన్ అధికారులను ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. గురువారం మండలంలోని శాఖాపూర్ లిఫ్ట మరమ్మతు పనులను సంబంధిత అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. మోటర్లు చెడి పోవడంతో లిఫ్ట నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని ఆయకట్టు రైతులు ఇటీవల ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లారు. స్పందించిన ఆయన ఇరిగేషన్ అధికారులతో కలిసి చెడి పోయిన మోటర్లను పరిశీలించారు. కాల్వల పూడిక తీత పనులు కూడా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట ఇరిగేషన్ ఎస్ఈ బద్రినారాయణ, తహసీల్దార్ నారాయణ, ఎంపీడీవో నాగనాథ్, డిప్యూటీ ఈఈ బాల్‌రాం, ఏఈలు ప్రణయ్‌రెడ్డి, శ్రీధర్, స్థానిక నాయకులు ఉన్నారు.

సంక్షిప్తంగా..

● **ఆలయంలో చోరీ** -నవీపేట, జూన్ 20: కమలాపూర్ అంకాలమ్మ, పోలేరమ్మ ఆలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగిందని ఆలయ కమిటీ చైర్మన్ వెంకట్‌రమణారెడ్డి తెలిపారు. తాళాలు పగులగొట్టి ఆలయంలోకి ప్రవేశించి అమ్మవారి వెండి కండ్లను ఎత్తుకెళ్లినట్లు ఆయన పేర్కొన్నారు. సీసీ టీవీ పుటేజీని పోలీసులకు అందజేసినట్లు చైర్మన్ తెలిపారు. దొంగలను పట్టుకుంటామని ఎస్సై యాదగిరిగౌడ్ పేర్కొన్నారు. ఇటీవల బైక్ చోరీ చేసిన దొంగల ఆచూకీ లభ్యమైనట్లు చెప్పారు.

● **కిరాణా షాపులో చోరీకి యత్నం..**-నవీపేట, జూన్ 20: మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డులో బుధవారం రాత్రి దొంగలు చోరీకి విఫలయత్నం చేశారు. రమాకాంత్‌కు చెందిన కిరాణా షాపునకు నాలుగు తాళాలు వేసి వెళ్లారు. దుండగులు తాళాలు పగుల గొట్టే ప్రయత్నం చేస్తుండగా అటు వైపు వస్తున్న మనుషుల అలజడిని పసిగట్టి అక్కడి నుంచి వెళ్లిపోయారు. అంతకు ముందు మేక జనార్దన్‌కు చెందిన పాన్ షాపులో చోరీ చేశారు. పోలీసులకు ఫోన్ ద్వారా సమాచారం అందించినట్లు బాధితుడు రమాకాంత్ పేర్కొన్నారు.

● **కొనసాగుతున్న మిషన్ భగీరథ సర్వే** -నందిపేట్, జూన్ 20: మండల కేంద్రంలో మిషన్ భగీరథ నల్లాల గుర్తింపు సర్వేను ఇంటింటా తిరుగుతూ చేపట్టినట్లు పంచాయతీ అధికారి కిరణ్‌కుమార్ గురువారం తెలిపారు. జీపీ సెక్రటరీ నవీన్‌కుమార్, జీపీ కార్యదర్శులు పాల్గొన్నారు.

● **సర్వేను త్వరగా పూర్తి చేయాలి:** రుద్రూర్, జూన్20: మండలంలో మిషన్ భగీరథ సర్వేను త్వరగా పూర్తి చేయాలని డీఎల్‌పీవో సాయిబాబా అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలో కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కొనసాగుతున్న భగీరథ సర్వేను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. పంచాయతీల వారీగా సర్వే జాబితాను సిద్ధం చేసి ఉంచాలన్నారు.

● **పోయిన ఫోన్‌ను బాధితుడికి అప్పగింత**- మోర్తాడ్, జూన్20: మండల కేంద్రానికి చెందిన బోగ రాముకు చెందిన ఐఫోన్ 2023 ఆగస్టులో గ్రామంలో పడిపోయింది. ఈవిషయమై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గతంలో ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్ ఆచూకీని కనుక్కుని గురువారం బాధితుడికి అప్పగించినట్లు ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు.

● **పాఠశాలల తనిఖీ** -మోర్తాడ్, జూన్ 20: కమ్మర్‌పల్లి మండలం నాగాపూర్ గ్రామంలో గురువారం సీఎంవో శ్రీనివాస్‌రావు, ప్లానింగ్ కోఆర్డినేటర్ శ్రీధర్ రెడ్డి ప్రభుత్వప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలో చేపట్టిన అమ్మ ఆదర్శపాఠశాల పనులను పరిశీలించారు. మిగిలి ఉన్న అమ్మ ఆదర్శపాఠశాల పనులను పూర్తి చేయాలని సూచించారు.

● **ముప్కాల్ ఇన్‌చార్జి కార్యదర్శిగా శ్రీనివాస్** - ముప్కాల్, జూన్ 20: స్థానిక గ్రామ పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శిగా శ్రీనివాస్ గురువారం బాధ్యతలు స్వీకరించినట్లు ఎంపీడీవో ముజాఫిర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈయన రెంజర్ల ఈవోగా బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

● **ప్లాస్టిక్ కవర్లు వినియోగించొద్దు**- ఆర్మూర్‌టౌన్, జూన్20: పట్టణంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో పండ్ల దుకాణాల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేశ్, పర్యావరణ ఇంజినీర్ పూర్ణమౌళి గురువారం తనిఖీ చేశారు. తనిఖీల్లో పట్టుబడిన ప్లాస్టిక్ కవర్లను సీజ్ చేసి జరిమానా విధించారు.

● **బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం:** కోటగిరి, జూన్ 20: మండల కేంద్రానికి చెందిన సురేశ్ అనే తాపీ మేస్త్రీ అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి తాపీ మేస్త్రీ యూనియన్ తరపున రూ.18 వేలు ఆర్థిక సాయం గురువారం అందజేసినట్లు యూనియన్ సభ్యులు తెలిపారు.

● **గ్రామదేవతలకు జలాభిషేకం:** సిరికొండ, జూన్ 20: మండలంలోని గడ్కోల్‌లో వీడీసీ ఆధ్వర్యంలో గురువారం గ్రామదేవతలకు జలాభిషేకం చేశారు. సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలతో విలసిల్లాలని కోరూతూ మహిళలు నీళ్ల బిందెలతో ఊరేగింపు నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● **ఆదర్శ పాఠశాలకు విద్యార్థుల ఎంపిక :** ధర్పల్లి, జూన్ 20 : స్థానిక ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశాలకు ఎంపికైన విద్యార్థుల రెండో జాబితాను పాఠశాలలోని నోటీసు బోర్డుపై ప్రదర్శించినట్లు ప్రిన్సిపాల్ రాజేందర్‌సాహెబ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ధ్రువీకరణ పత్రాలను శుక్రవారం పాఠశాలలో సమర్పించాలని సూచించారు.

● **పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి:** పొతంగల్, జూన్ 20: మండలంలోని కల్లూరు గ్రామంలో గురువారం ఆరోగ్య సిబ్బంది ఆరోగ్య సర్వే నిర్వహించారు. ఇంటింటి తిరుగుతూ వ్యాధులపై అవగాహన కల్పించారు.కాఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్, హెల్త్ సూపర్‌వైజర్ సాయికుమారి పాల్గొన్నారు.

● **చిన్నారులకు అక్షరాభ్యాసం**- కోటగిరి, జూన్ 20: ఎత్తొండలోని ఉన్నత, ప్రాథమిక, ఉర్దూ మీడియం ప్రాథమికోన్నత పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రంలో కొత్తగా చేరిన చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్యబోధన ఉంటుందని ఎత్తొండ హైస్కూల్ హెడ్‌మాస్టర్ అలివేలు అన్నారు.

● **జాతీయస్థాయి పోటీల్లో 'విజయ్' విద్యార్థిని ప్రతిభ:** ఖలీల్‌వాడి, జూన్ 20: తెలంగాణ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో ఈ నెల 14 నుంచి 16 వరకు నిర్వహించిన పోటీల్లో విజయ్ విద్యాసంస్థలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని ఎన్.మేఘన సైక్లింగ్, స్విమ్మింగ్, పరుగుపందెం పోటీల్లో పాల్గొని ప్రశంసా పత్రం అందుకున్నట్లు పాఠశాల కార్యదర్శి డాక్టర్ అమృతలత తెలిపారు. విద్యార్థినిని గురువారం అభినందించారు.

నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

అర్సపల్లి ప్రభుత్వ పాఠశాలలో మాత్రలు వేస్తున్న జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, నగర మేయర్ దండు నీతూకిరణ్

బోధన్‌లోని రాకాసిపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న ఆర్డీవో అంబాదాస్ రాజేశ్వర్

కోటగిరి హైస్కూల్‌లో విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్ర వేస్తున్న ఎంపీపీ సునీత

ఆర్మూర్ పట్టణంలో విద్యార్థులకు మాత్రలను వేస్తున్న కౌన్సిలర్ సంగీత

బోధన్ /మోర్తాడ్/ భీమ్‌గల్/ ఆర్మూర్‌టౌన్/ ఆలూర్/బోధన్ రూరల్/ రెంజల్/ ఖలీల్‌వాడి/ కోటగిరి/ రుద్రూర్/ పొతంగల్, జూన్20: పిల్లల ఎదుగుదలపై తీవ్రమైన ప్రభావం చూపే నులిపురుగుల నివారణ కోసం ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం జిల్లాలో గురువారం నిర్వహించారు. అన్ని విద్యా సంస్థల్లో 19 ఏండ్ల లోపు వయస్సు ఉన్న వారికి వీటిని వేశారు. నగరంలోని అర్సపల్లిలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు హాజరై పిల్లలకు మాత్రలను వేశారు. నగర మేయర్ దండు నీతూకిరణ్ పాల్గొన్నారు. బోధన్ డివిజన్‌లో మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని బోధన్ ఆర్డీవో అంబాదాస్ రాజేశ్వర్ ప్రారంభించారు. బోధన్‌లోని రాకాసిపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పిల్లలకు ఆయన మాత్రలను ఇచ్చారు. బోధన్ డివిజన్‌లో 96 వేల మంది విద్యార్థులకు ఈ మాత్రలను పంపిణీచేస్తామన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో విద్య మాట్లాడుతూ తొలిరోజు మాత్రలు వేసుకోని వారు.. ఆరు రోజుల్లో ఎప్పుడైనా తప్పకుండా వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ మేరీ, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు బాలచంద్రం తదితరులు పాల్గొన్నారు. మోర్తాడ్, కమ్మర్‌పల్లి మండలాల్లోని అన్ని గ్రామాల్లో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో నులిపురుగుల నివారణ మాత్రలను వైద్యులు, సిబ్బంది విద్యార్థులకు పంపిణీ చేశారు. బషీరాబాద్ అంగన్‌వాడీ కేంద్రంలో డాక్టర్ సుప్రియ పిల్లలకు మాత్రలు వేశారు. భీమ్‌గల్ మండలం సంతోషినగర్ ప్రాథమిక పాఠశాలలో మాత్రలు పంపిణీ చేసినట్లు హెచ్ఎం మల్క జనార్దన్ తెలిపారు. ఆర్మూర్ వడ్డెర కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మాత్రలను కౌన్సిలర్ సంగీత పంపిణీ చేశారు. ఆలూర్ మండలంలోని కల్లెడ జడ్పీ ఉన్నత పాఠశాలలో మాత్రలను వైస్ ఎంపీపీ సుజాత వేశారు. బోధన్ మండలంలోని లంగ్డాపూర్ గ్రామంలో చిన్నారులకు నులి పురుగుల నివారణ మాత్రలు బోధన్ ఎంపీవో మధుకర్ వేశారు. రెంజల్ మండలం నీలా గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను ఎంపీడీవో శ్రీనివాస్ అందజేశారు. ఎంఈవో గణేశ్‌రావు కులకర్ణి, హెచ్ఎం ఇల్తెపు శంకర్, ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు. కోటగిరి హైస్కూల్ ఆవరణలో ఎంపీపీ సునీత పిల్లలకు మాత్రలు వేశారు. రుద్రూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల, కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలల్లో మాత్రలు వేసినట్లు హెచ్ఈవో రాజేందర్ తెలిపారు. పొతంగల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఆరోగ్య సిబ్బంది ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు.

22,23 తేదీల్లో మహాసభ, ర్యాలీ

కంఠేశ్వర్,జూన్ 20: ఈ నెల 22, 23వ తేదీల్లో డ్రగ్స్ మహమ్మారిపై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించనున్నట్లు ప్రముఖ మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ విశాల్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇండియన్ సైక్రియాట్రిక్ అసోసియేషన్, ఇండూర్ న్యూరో సైకియాట్రిక్ దవాఖాన సంయుక్త ఆధ్వర్యంలోఈనెల 22న కృష్ణ హోటల్‌లో రాష్ట్ర స్థాయి మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహా హాజరుకానున్నారని పేర్కొన్నారు. 23న పాత కలెక్టరేట్ గ్రౌండ్ నుంచి రాజీవ్ గాంధీ ఆడిటోరియంవరకు డ్రగ్స్ మహమ్మారిపై ర్యాలీ నిర్వహిస్తామని, జిల్లా జడ్జి సునీత కుంచాల హాజరవుతారని వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ట్రాన్స్‌కో ఏఈ మృతి

రవిచంద్ర (ఫైల్)

శక్కర్‌నగర్, మే 25: రోడ్డు ప్రమాదంలో ట్రాన్స్‌కో బోధన్ రూరల్ ఏఈ రవిచంద్ర(46) మృతి చెందినట్లు బోధన్ పట్టణ సీఐ వీరయ్య గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బోధన్ రూరల్ ఏఈగా పని చేస్తున్న రవిచంద్ర ఎడపల్లి ఇన్‌చార్జి ఏఈగా బాధ్యతలు చేపడుతున్నారు. ఎడపల్లిలో విధులు నిర్వహించి తిరిగి వస్తుండగా నర్సాపూర్ శివారులో ఆయన బైక్ ఢీవైడర్‌ను ఢీ కొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం నిజామాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. మృత్యుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్న